# మోసగాడు

## డా॥ రజనీకాంత రెడ్డి

"లాభం లేదోయ్ క్రిష్టమూర్తీ, ఈ రిపోర్ట్సు చూస్తుంటే నాకేమంత హోప్ కనిపించడంలేదు, నీకు మళ్ళీ పిల్లలు పుడతారని" పెదవి విరుస్తూ చేతిలోని పెథాలజీ రిపోర్ట్సు టేబిల్ మీదుంచాడు డాక్టర్ మనోహర్.

"అంతేనంటారా సార్?" ముందుగానే పరిస్థితి ఊహించినా కూడా క్రిష్ణమూర్తి కంఠంలో నిరాశ తొంగి చూసింది.

"అయినా మన ప్రయత్నం మనం చేద్దాం. ఉన్నవాటిలో మంచి మందులు రాసిస్తాను. ఒక ఆర్నెల్లపాటు వాడిచూడు. ఆపైన నీ అదృష్టం"

"అలాగేసార్. నేను ఈ ఊరొచ్చిన ఆరేళ్లనించీ తమరే మా ఇంట్లో అందరికీ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. నా ఒంట్లో జబ్బుల గురించి మీకు బాగా పూర్తిగా కొట్టిపారెయ్యలేం కూడా" ఆ మాటలంటున్న క్షణంలో అతని మనసులో ఒక ప్లాన్‌కి బీజం పడిందన్న సంగతి క్రిష్ణమూర్తికి తెలీదు పాపం.

క్రిష్ణమూర్తికి సుమారు నలభయ్యయిదేళ్లు ఉంటాయి. మునిసిపల్ ఆఫీస్‌లో అటెండర్‌గా చేరి తరువాత ఎల్డీసీ అయ్యాడు. ఇప్పుడున్న సీట్లో పైరాబడి బాగా వస్తుండడంతో ఆ సీటు మారకుండా, ట్రాన్స్‌ఫర్ కాకుండా ఆరేళ్ళనించీ మేనేజ్ చేస్తున్నాడు. మొదటి భార్య ఏదో జబ్బుతో చనిపోతే దుర్గని రెండో పెళ్లి చేసుకున్నాడు. అతని వయసు తెలిసి, విపరీతంగా తాగుతాడని తెలిసికూడా, అతని ఉద్యోగం, పై రాబడి చూసి దుర్గని అతనికిచ్చి చేసింది, భర్త చనిపోయి ఏ దిక్కూ లేక పేదరికంలో మగ్గుతున్న దుర్గతల్లి.

**ఒక చెయ్యి ఆమె పొత్తికడుపుమీద ఉంచి పరీక్ష చేస్తున్న మనోహర్‌కి ఆ స్పర్శ ఎక్కడలేని ఉద్రేకం కలిగిస్తోంది. అవసరమైనదానికన్నా ఎక్కువసేపు ఆ స్పర్శాసుఖం అనుభవిస్తూ అన్నాడు. "నీ అనుమానం నిజమే"**

తెలుసుకదాసార్. మీరెట్లా చెప్తే అట్లాగే చేస్తాను" అతని మాటల్లో డాక్టర్ మీద నమ్మకం, అభిమానం ధ్వనించాయి.

"ఇదుగో, ఈ టాబ్లెట్స్, ఇంజెక్షన్లు రెగ్యులర్‌గా వాడు. ఇంజెక్షన్ మాత్రం వారానికోసారి మర్చిపోకుండా వేయించుకోవాలి. చూద్దాం, ఓ ఆర్నెల్లు "ప్రిస్క్రిప్షన్ చేతికిస్తూ అన్నాడు మనోహర్. "నీ మొదటి భార్యకి ఒక అమ్మాయి, ఆ తరువాత రెండు అబార్షన్లయ్యాయని చెప్పావుకదూ?"

"అవునుసార్. ఆ అమ్మాయికిప్పుడు పన్నెండేళ్ళు. వాళ్ళమ్మ పోయిన తరువాత నాలుగేళ్లయింది దుర్గని చేసుకుని. కాని ఇంతవరకు తనకొక్కసారి కూడా నెలతప్పలేదు. తనకసలే చిన్నపిల్లలంటే ప్రాణం. ఎప్పుడూ పక్కింటోళ్ల పాపతో ఆడుకుంటుంది. ఎలాగైనా మీ చేతిచలవతో ఈ ట్రీట్‌మెంట్ సక్సెసయ్యేలా చూడండిసార్ "ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"చెప్పానుకదా, మన ప్రయత్నం మనం చేద్దాం. ఇలాంటి కేసుల్లో ఖచ్చితంగా ఏమీ చెప్పలేం. అలాగని

డబ్బుకి ఇబ్బంది లేకపోవడంతో క్రిష్ణమూర్తి వయసులో ఉన్నప్పుడు చెడతిరిగి, ఉన్న సుఖరోగాలన్నిటిలో తిరుగులేని అనుభవం సంపాదించేసాడు. దానికితోడు విపరీతమయిన తాగుడువల్ల ఇప్పుడిప్పుడే ఇంపొటెన్సీకూడా వస్తోంది. డాక్టర్ మనోహర్‌కి ఈ విషయాలన్నీ బాగా తెలుసు. దుర్గకూడా చాలాసార్లు ట్రీట్‌మెంట్ కోసం వచ్చింది. సుమారు ఇరవై రెండేళ్ళుంటాయి. గొప్ప అందగత్తె కాదుకాని మళ్లీ మళ్లీ చూడాలనిపించే ముఖం ఆమెది. పైగా యవ్వనంలో ఎక్కడెక్కడ ఉండాల్సిన ఎత్తుపల్లాలు అక్కడక్కడ ఉండటంతోపాటు ఎప్పుడూ నీటుగా ముస్తాబై ఉండటంవలన మనిషిలో మంచి ఆకర్షణ ఉంది. ఆమె ఎత్తైన గుండెలమీద స్టెత్‌స్కోపుతో పరీక్ష చేసేటప్పుడు ఆ తగిలీ తగలని స్పర్శకు మనోహర్‌లో కోరిక జివ్వుమనేది. అవన్నీ మనసులో సినిమా రీల్లా మెదిలి అతనిలో ఒక ప్లాన్ రూపుదిద్దుకోవడం మొదలుపెట్టింది.

చాలారోజులుగా డాక్టర్ మనోహర్‌కి దుర్గతో ఒంటరిగా మాట్లాడే అవకాశం రాలేదు. క్రిష్ణమూర్తితో కలిసి నాలుగయిదుసార్లు హాస్పిటల్‌కి వచ్చిందిగానీ ఆమెను ఒంటరిగా పరీక్ష చేసే అవకాశంగాని, ఒంటరిగా మాట్లాడే ఛాన్స్‌గాని రాలేదు.

ఆరోజు ఆదివారం. పైగా ఏదో ఆడవాళ్ల పండగ అవడంతో పేషంట్లు ఒకరూ అరా వచ్చి వెళ్తున్నారు. కాంపౌండర్ మూర్తికూడా పనుందని చెప్పి పర్మిషన్ తీసుకుని వెళ్లిపోయాడు. ఖాళీగా ఉన్న మనోహర్ చేతిలో ఇంగ్లీష్ నవల పేజీలు తిప్పుతున్నాడు. పుస్తకం చదువుతున్నవాడల్లా తనముందు ఎవరో నిలుచున్నట్లు అనిపించి తలెత్తి చూసాడు. ఎదురుగా దుర్గ. ఒక్కక్షణం మెదడు పనిచెయ్యడం మానేసి బ్లాంక్ అయిపోయింది. ఎన్నాళ్లనించో ఎదురుచూస్తున్న అవకాశం— ఇలా అయాచితంగా అనుకోకుండా— ఆఫీస్ టైములో హైదరాబాద్‌లో సిటీబస్ ఖాళీగా స్టేజిలోకొచ్చి ఆగినట్టు అంతలోనే తమాయించుకుని,

"ఏమ్మా ఒంట్లో బాగాలేదా? ఇలారా" లోపల అలజడి బయటికి కనపడకుండా ప్రొఫెషనల్ మాస్క్ వేసుకున్నట్లు, స్టూల్ చూపిస్తూ అన్నాడు.

ఆమె నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ సంశయంగా వచ్చి బెరుగ్గా స్టూలు మీద కూర్చుంది. నేల చూపులు చూస్తూ, చూపుడువేలుకి చీరకొంగు చుట్టుకుంటూ మౌనంగా ఉండిపోయింది. ఆమె వాలకం చూస్తున్నకొద్దీ మనోహర్‌లో ఆశ, అలజడి ఎక్కువవుతున్నాయి.

"ఊ! ఏమిటి సంగతి, చెప్పు" తన భావాలు బయటపడనీకుండా అన్నాడు. ఆమె ఒక్కసారి నెమ్మదిగా కళ్లు పైకెత్తి చూసి మళ్లీ దించుకుంది. "సార్ మా ఆయనకి ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదటకదా?" నేలవైపు చూస్తూనే అడిగింది.

"నీకెలా తెలిసింది?" ఆశ్చర్యపోతూ, తన ప్రశ్నలోనే ఆమె ప్రశ్నకు జవాబు చెప్పాడు.

"మా చిన్నాన్న ఒకాయన ఆరెంపీగా చేస్తున్నాడు. మొన్నొకసారి మా ఇంటికి వచ్చినప్పుడు నేను ఈయన రిపోర్ట్సు చూపిస్తే చెప్పాడు" మెల్లగా అంది.

ఈ విషయం తను చెప్పాల్సిన అవసరం లేకుండానే ఆమెకి తెలిసిపోయింది. అదీ ఒకందుకు మంచిదే అనిపించింది మనోహర్‌కి. ఇక తను నెమ్మదిగా ప్రొసీడ్ అయిపోవచ్చనిపించింది.

"నీకు పిల్లలంటే చాలా ఇష్టమటగదా, మీ ఆయన చెప్పాడు." ఉపోద్ఘాతంగా అన్నాడు, ఆమె రియాక్షన్ గమనిస్తూ. అవునన్నట్లుగా ఆమె పైకీ క్రిందకీ తలాడించింది మౌనంగా. ఆమె కళ్ళల్లో మెదులుతున్న సన్నటి నీటిపొర మనోహర్ దృష్టిలో పడింది. క్రింది పెదవిని పైపంటితో నొక్కిపట్టిన ఆమె తీరును చూసి ఆమె ఏదో చాలా ముఖ్యమైన విషయం చెప్పడానికి సంకోచంతో తటపటాయిస్తుందని గ్రహించాడతను.

"చూడమ్మా, నువ్వేదో విషయం చెప్పాలని వచ్చినట్టున్నావు. కాని ఎందుకో భయపడుతున్నావు. మరేం ఫరవాలేదు. నీ మనసులో ఏముందో చెప్పు. నాకు చేతనయినంత సహాయం చేస్తాను." పైకి అతని మాటలు చాలా 'అనునయంగా ఉన్నా లోపలమాత్రం అతని మనసులో అప్పుడే కోరిక పురివిప్పుతోంది.

ఆమెలోని భయం అతనికి మరింత ధైర్యాన్నిస్తోంది.

ఆమె నెమ్మదిగా గొంతు విప్పింది. "సార్ మా





ఇంట్లో ఎవరికీ ఏ అవసరం వచ్చినా మీరు తప్ప ఇంకో డాక్టర్ దగ్గరికి ఎప్పుడూ వెళ్లలేదు మేము. మీ మీద మా అందరికీ చాలా నమ్మకం, గౌరవం ఉన్నాయి.'' తను చెప్పబోయే విషయానికి మాటలు వెతుక్కుంటున్నట్టుగా ఆగిందామె. ''నాకు మొదట్నించీ పిల్లలంటే ఇష్టం. కాని నా దురదృష్టంకొద్దీ పెళ్ళయి ఇన్నేళ్ళయినా నాకా భాగ్యం కలగలేదు. మొన్న మా చిన్నాన్న చెప్పిన సంగతి విన్నప్పటినించీ ఏంచెయ్యాలో అర్థం కావడంలేదు, ఇప్పుడు నా పరిస్థితికి. నాకు... నాకు ఇప్పుడు రెండోనెల అని అనుమానంగా ఉందిసార్. ఈ విషయం ఆయనకి ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. ఇప్పుడు మీరే నన్ను ఈ గండంనించి రక్షించాలి. మీరు తప్ప ఇంకెవరూ నాకు సాయం చెయ్యలేరు.'' అప్పటివరకూ ఆమె బలవంతంగా ఆపి ఉంచిన కన్నీరు ఇక ఆగలేనంటూ బయటికి పొంగి ఆమె వేలతనాన్ని బయటపెట్టాయి. సిగ్గుతో, అభిమానంతో ఆమె తల మరీ కిందికి వాలిపోయింది. లేకపోతే ఆ సమయంలో డాక్టర్ మనోహర్ ముఖంలో కనిపించిన ఆనందానికి ఆమె నిర్ఘాంతపోయేదే.

తను ఏ మాత్రం శ్రమపడకుండా, కనీసం నోరు తెరిచి అడగనయినా అడక్కుండానే తన కోరిక తీరబోతున్నందుకు మనోహర్ ఆనందంతో తలమునకలై పోతున్నాడు. అతనికి విషయం అంతా అర్థమయిపోంది. ముసలిభర్త, పడుచు పెళ్లాం. దానికి తోడు తాగుడు వ్యసనంలో ఎడి భార్య అవసరాలు, కోరికలు తీర్చలేని మొగుడు. పిల్లలు కావాలనే వంకతో తనని తాను మభ్యపెట్టుకుని, ఏ పక్కింటి పడుచు కుర్రాడితోనో తన కోరికలు తీర్చుకుని, తీరా కడుపొచ్చింతరవాత ఇప్పుడు అబార్షన్ కోసం వచ్చిన భార్య— ఆ సంగతి భర్తకు తెలియకుండా ఉండాలని తన సహాయం కోరి వచ్చింది. తరిమే పిల్లి బారినుండి

రక్షిస్తాడన్న ఆశతో యజమాని దగ్గరకు పరిగెత్తుకువచ్చిన అమాయకమైన కోడిపిల్లలా ఉందామె పరిస్థితి. తనను రక్షిస్తాడనుకున్న యజమానే ఇంకాసేపట్లో తనను కోసుకుని కూరొండు కోబోతున్నాడని తెలీదు పాపం ఆ కోడిపిల్లకి.

"చూడు దుర్గా నువు కంగారు పడాల్సిన పనేం లేదు. ముందుగా నీ అనుమానం నిజమో కాదో పరీక్ష చేసి చూద్దాం. లోపలికి పద" అంటూ ఎగ్జామినేషన్ రూంలోకి దారి తీసాడు. ఆ రూంలోకి అడుగుపెట్టేముందు తను డాక్టర్ తప్ప హాస్పిటల్‌లో ఇంకెవరూ లేరన్న విషయాన్ని దుర్గ గమనించలేదు. తన సమస్యకి ఎంత త్వరగా పరిష్కారం దొరుకుతుందా అన్న టెన్షన్‌లో ఉన్న ఆమె మిగతా విషయాలు పట్టించుకునే స్థితిలో లేదు.

ఒక చెయ్యి ఆమె పొత్తికడుపుమీద ఉంచి పరీక్ష చేస్తున్న మనోహర్‌కి ఆ స్పర్శ ఎక్కడలేని ఉద్రేకం కలిగిస్తోంది. అవసరమైనదానికన్నా ఎక్కువసేపు ఆ స్పర్శాసుఖం అనుభవిస్తూ ఉన్నాడు. "నీ అనుమానం నిజమే, రెండోనెల పూర్తికావస్తోంది. వెంటనే అబార్షన్ చేస్తే తేలిగ్గా అయిపోతుంది."

అతని మాటలకు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఇంకా తన పొట్టమీద ఉన్న అతని చేతిని పక్కకు తొలగించి చీర సర్దుకుంటూ లేచి కూర్చుంది.

"సార్ నాకు కావల్సింది అబార్షన్ కాదు. నాకు ఈ బిడ్డ కావాలి. ఇందాకే చెప్పాను కదా మీకు, నాకు పిల్లలంటే ప్రాణమని"

"మరైతే నన్నేం చేయమంటావ్?" అబార్షన్ వద్దంటున్న దుర్గని కనుబొమలు ముడివేసి చూస్తూ అడిగాడు.

"సార్, మీకు తప్ప ఇంకెవరికీ మా ఆయన సంగతి తెలీదు. మీరిచ్చిన ట్రీట్‌మెంట్ వల్ల ఆయనకు మళ్లీ పిల్లలు పుట్టే అవకాశం వచ్చిందని మీరు ఆయనతో చెప్తే చాలు. ఆయన మీ మాట తప్పకుండా నమ్ముతారు. మా చిన్నాన్నకి కూడా అలాగే చెప్తాను నేను అవసరమయితే. మీరు నాకు ఈ సహాయం చేస్తే జన్మాంతం మీకు ఋణపడి ఉంటాను సార్" రెండు చేతులూ జోడించిందామె కన్నీళ్లతో.

కొన్ని క్షణాలపాటు ఆమె తెలివికి ఆశ్చర్యపోయాడు మనోహర్. అతను ఈ రకమైన మలుపును ఊహించలేదు. తను ఊహించిన దానికంటే ఇంకా ఎక్కువగా ఆమె మీద తనకి కంట్రోల్ వచ్చింది ఇప్పుడు. అనుకోని ఈ అదృష్టానికి లోలోపలే పొంగిపోయాడతను.

నర్మగర్భంగా నవ్వుతూ, నెమ్మదిగా ఆమె దగ్గరికి వచ్చి రెండు చేతులూ భుజాల మీద వేసాడు ఆమె కళ్లలోకి చూస్తూ. అనుకోని ఈ ప్రవర్తనకు ఆమె బిత్తరపోయి "సార్...." అంటూ సంశయంగా ఆగిపోయింది.

"భయపడకు దుర్గా, నీ రహస్యం తెలీకుండా నేను చూస్తాను. మరి అందుకు నీ హెల్ప్ కూడా కావాలి కదా" అతని చేతులు ఆమె భుజాలమీంచి గుండెలపైకి పాకుతున్నాయి. అతని పెదాలు ఆమె పెదవులకోసం ముందుకొస్తున్నాయి.

అతని అంతర్యాన్ని గమనించిన దుర్గ బలంగా అతన్ని పక్కకినెట్టి ఎగ్జామినేషన్ టేబిల్‌మీదనించి కిందకి దూకింది అమాంతంగా.

"ఒద్దుసార్, దయచేసి నన్ను ఒదిలెయ్యండి. మీమీద ఉన్న గౌరవంతో, మీరు నా బతుకు నిలబెడతారన్న ఆశతో మీ సహాయం కోసం వచ్చాను. కాని మీరు నన్ను ఇలా అపార్థం చేసుకుంటారనుకోలేదు" ఏడుపు, నిరాశ కలిసిన గొంతులోంచి వచ్చాయా మాటలు.

కాని ఆమె నిరాకరణతో అతనిలోని అహం బుసలుకొట్టింది. ఆఫ్టరాల్ ఒక బోడి గుమాస్తా భార్య, అందులో మరెవడితోనో అంతకుముందే పడుకున్న ఆడది తనని కాదంటుందా? తను డాక్టర్ ఆమె పేషంటన్న విచక్షణ మరిచి, కోపంగా ఆమె చెయ్యి పట్టుకుని విసురుగా తనమీదకి లాక్కున్నాడు. రెండు చేతుల్తో ఆమె భుజాలు ఒడిసి పట్టుకుని "ఏం వేషాలేస్తున్నావా? నాకా మాత్రం అర్థం కాలేదనుకుంటున్నావా? ఇంకెవడితోనో కులికి కడుపు తెచ్చుకున్నపుడు ఎక్కడికి పోయింది ఈ బెట్టంతా? మర్యాదగా నేను చెప్పినట్టు విను. లేకపోతే నీ సంగతి నీ మొగుడికి చెప్తే నీ గతి ఏమవుతుందో ఆలోచించుకో!"

చివ్వున తలెత్తి తీక్షణంగా అతని కళ్లలోకి చూసిందామె అసహ్యం నిండిన చూపులతో.

"ఛీ, నువ్విలాంటి వాడివని తెలీక నీ సహాయం కోరి వచ్చాను. ఇక ఛస్తే నీ మొహం చూడను" ఒక్కసారిగా ఇనుమడించిన బలంతో అతన్ని నెట్టేసింది. అనుకోని ఆ ఊపుకి వెళ్ళి టేబిల్‌ని పట్టుకుని నిలదొక్కుకున్నాడు మనోహర్.

"చూడు నువ్వేదో పెద్ద మనసుతో మేలు చేస్తావని నీ దగ్గరకొచ్చాను. నాకు పిల్లలంటే ఇష్టం. కాని దురదృష్టంకొద్దీ నా భర్తద్వారా పిల్లలు పుట్టే యోగం లేక నాకిష్టమయిన మనిషితో కలిసి కడుపు తెచ్చుకున్నాను. అంతేగాని ప్రతి అడ్డమైన వాడితోనూ పడుకోడానికి నేనేం బజారు మనిషిని కాదు. నా మొగుడితో ఏం చెప్పుకుంటావో, ఏం చేసుకుంటావో చేసుకో ఫో" విరుచుకుపడ్డ ప్రవాహం లాంటి ఆ మాటల్లో పడి మనోహర్ తేరుకోకముందే దుర్గ తలుపులు తెరుచుకుని బయటపడింది.

డాక్టర్ మనోహర్‌కి అవమానంతో ఒళ్ళంతా మంటలు పుడుతోంది. చూస్తాను దీని పొగరేంటో. రేపు దీని మొగుడు వచ్చినపుడు చెప్తాను దీని సంగతి. నన్ను కాదంటుందా? ఆ రోజంతా, ఆ రాత్రంతా ఈ అవమానంతో కుతకుతలాడిపోయాడు.

* * *

"నమస్కారం సార్" క్రిష్ణమూర్తి కంఠం విని చివ్వున తలెత్తి చూసాడు మనోహర్. అతని మనసులో నిన్నటి అవమానం తాలూకు మంటలు భగ్గుమన్నాయి ఫ్రెష్‌గా. పైకి కనబడనీయకుండా "రా క్రిష్ణమూర్తీ, రా ఇంజెక్షన్ కోసమేనా?" అన్నాడు.

"లేదుసార్, ఇంక వాటితో పనిలేదు. ఆ సంగతి చెప్పిపోదామనే వచ్చాను" అతని ముఖంలో ఓ రకమైన ప్రశాంతత కనిపిస్తోంది.

"అంటే?" ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి




## లేట్


యధావిధంగా ఆరోజు కూడా ఆఫీసుకి లేట్‌గా వచ్చిన సూర్యాన్ని నిలేశాడు బాస్.

"రోజూ అందరూ ఆఫీసుకి ఎన్ని గంటలకొస్తున్నారో తెల్సా?"

"తెలీదండీ. నేనొచ్చేసరికే అందరూ సీట్లలో కూర్చునుంటారు" చెప్పాడు వినయంగా.

—గొల్లపూడి శైలజ
(హైద్రాబాద్)





అందుకని

"నా పెయింటింగ్ మీకు బాగా నచ్చినట్టుంది?" సంతోషపడుతూ అడిగాడు ఆనంద్ రమని.

"ఎలా అనుకుంటున్నారు?"

"ఇంతసేపూ పెయింటింగ్ దగ్గరే నిలబడిపోతేనూ..."

"అబ్బే. అందుక్కాదులెండి. మిగిలిన పెయింటింగ్స్ దగ్గర చాలా రష్‌గా ఉంది. అందుకని..." మోమాటంగా వున్న నిజాన్ని చెప్పేసింది.

—గొల్లపూడి శైలజ
(హైదరాబాద్)

చూసాడు మనోహర్.

"నా భార్యకిప్పుడు రెండో నెల సార్. నిన్ననే నాకు అన్ని విషయాలు చెప్పింది. తన కోరిక తీరింది కద సార్. ఇక ఈ మందులూ అవీ ఎందుకని, మీకు చెప్పి పోదామని వచ్చాను" తల కొద్దిగా కిందికి వంచుకుని మాట్లాడుతున్నాడు.

ఒక్క క్షణం మనోహర్ బుర్ర మొద్దుబారిపోయింది. అన్నీ చెప్పిందా? అంటే నిన్న ఇక్కడ జరిగింది కూడానా? కాని అతని వాలకం చూస్తుంటే ఆ సంగతి చెప్పినట్లు లేదు. మరి గర్భం సంగతి ఎందుకు చెప్పింది? అంతా అయోమయంగా ఉండటానికి. ఏమడగాలో ఎలా అడగాలో అర్థం కాని స్థితి. తన రంగు బయటపడిందేమోనన్న టెన్షన్. చివరికి గొంతు పెగుల్చుకుని "అంటె మన ట్రీట్‌మెంట్ సక్సెస్ అయిందన్నమాట" అన్నాడు. అతని మాటలు అతనికే ఎబ్బెట్టుగా ఏదోలా అనిపించాయి.

నెమ్మదిగా తల పైకెత్తి కాదన్నట్టుగా తలూపాడు. "లేదుసార్, ఆ విషయంకూడా తనే చెప్పింది. కాని ఆ మనిషి పేరు మాత్రం అడగొద్దంది. తను చేసింది తప్పని నేనంటే, నేనేం చెయ్యమంటే అది చేస్తానంది. కావాలంటే ఏ బావిలోనన్నా దూకడానికి కూడా తను సిద్ధమేనంది" అతని కంఠంలో ఓ రకమైన ఉద్విగ్నత ధ్వనించింది.

ఆ మాటతో మనోహర్ పూర్తిగా నీరుకారిపోయాడు. తను ఇక ఆమె మీద ప్రతీకారం తీర్చుకోలేనని అర్థమయిపోయింది. నిన్నటి అవమానంతోపాటు ఈ ఓటమితో అతని నోటమాట రాకుండా అయిపోయింది.

"మరి.... మరి... నువ్వేం చేద్దామనుకుంటున్నావు?" ఇంకా ఎక్కడో మినుకుమినుకు మంటోంది ఆశ— భార్యని వదిలేస్తానంటాడా? తన్ని తగలేస్తానంటాడా? ఏమంటాడో?

"నాకు తను చేసిందాంట్లో తప్పేం కనిపించలేదు సార్. తప్పంతా నాలోనే ఉంది. నేను పెళ్ళి చేసుకోకముందే అన్నీ పరీక్షలూ చేయించుకుని ఉండాల్సింది. పైగానూ ఇద్దరికీ వయసులో చాలా తేడా ఉంది. నేను ముప్ఫై వయసులో ఉన్నప్పుడు. ఇంట్లో భార్య ఉండగానూ బయట తిరుగుళ్ళు విపరీతంగా తిరిగాను. ఇప్పుడు ఈ రోగాలు మూలాన నా ఒళ్ళు ఇంకా పాడయిపోయి తన సుఖం గురించి పట్టించుకోకుండా ఉన్నాను. మరి తనుకూడా ఉప్పుకారం తింటున్న మనిషే కదాసార్! ఎన్నాళ్ళని ఓర్చుకుంటుంది? నీతిన్యాయం మగాడికైనా ఆడదానికైనా ఒకటే ఉండాలని నా ఉద్దేశం. అందుకనే తను చేసిందాంట్లో తప్పేం లేదని చెప్పాను. నామటుకు నేను ఎవరేమన్నా పట్టించుకోను కూడా. కాని తను ఒకవేళ చుట్టుపక్కల వాళ్ళకి ఈ సంగతి తెలిస్తే వాళ్ళ సూటిపోటి మాటలకి తట్టుకోలేదు. అందుకని ఇక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నాను. వేరే ఊళ్ళో మళ్ళీ మీలాంటి మంచి డాక్టర్ దొరకాలని కోరుకుంటున్నాను సార్. వెళ్ళేముందు మీకు కనబడతాను. వస్తానుసార్" చేతులు జోడించి లేచాడు.

తల పైకెత్తి, నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్తున్న కృష్ణమూర్తి వైపు రెప్పవాల్చకుండా చూస్తున్న డాక్టర్ మనోహర్‌కి హఠాత్తుగా అతనెంతో ఎత్తుకెదిగిపోయినట్లు, తను తన కుర్చీలోనే కుంచించుకుపోతున్నట్లు అనిపించింది.

*


సకుటుంబంగా
చదువుకోడానికి
చక్కని కాలక్షేపానికి
ఆంధ్రభూమి
సచిత్ర మాస పత్రిక
ఎక్కువ పేజీలు
వెల 5 రూపాయలే!
చదవండి! చదివించండి!!
నేటి మాసపత్రికలలో
మేటి పత్రిక



యవ్వన శక్తి పొందండి



జీవితములో కోల్పోయిన యవ్వనము
నరముల బలమును తిరిగి పొందుటకు
ఇతర చికిత్సల వలన పుంసత్వము
పొందక విసుగు చెందినవారు సంపూర్ణ
సుఖము పొందుచున్నారు!

భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన
కవిరాజ్ డా॥ డి. హనుమంతరావు
(GOVT REGD)
మహంకాళి వీధి, సికింద్రాబాదు

సలహా ఫీజు 10.రూ—మందుల ఛార్జీలు ప్రత్యేకం
సంప్రదించు వేళలు
ఉదయం: 8 నుండి 12. మగల 2-6 వరకు
ఆదివారం: ఉదయం 8-12 వరకు

శాస్త్రీయమైన ఆయుర్వేద పద్ధతులతో
చికిత్స చేయబడును